క్లుప్తంగా

ఘనంగా మాజీ ఎమ్మెల్యే తిమ్మారెడ్డి వర్ధంతి



తిమ్మారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని సరస్వతీ విద్యామందిరం ఉన్నత పాఠశాలలో గురువారం స్థానిక మాజీ ఎమ్మెల్యే వైవీ తిమ్మారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తిమ్మారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ తిమ్మారెడ్డి దానగుణాన్ని కొనియాడారు. ఆయన నియోజకవర్గానికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. బెంగళూరు రోటరీ క్లబ్ సభ్యులు సరఫరా చేసిన నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాఘవాచారి, పాఠశాల సమితి అధ్యక్షుడు బద్రీనాథ్, కార్యదర్శి హనుమంతరెడ్డి, పాఠశాల కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

18న మండల సర్వసభ్య సమావేశం

మడకశిర: మడకశిర మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 18న ఉదయం 10:30 గంటలకు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ కవిత ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పలు అంశాలపై శాఖల వారీగా చర్చించనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులు

మడకశిర: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం ఈయూ (ఎంప్లాయిస్ యూనియన్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈయూలో సభ్యులుగా ఉన్న ఆర్టీసీ కార్మికులు ఈసందర్భంగా కేక్ కటింగ్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఈయూ అధ్యక్ష, కార్యదర్శులు రఫిక్, రంగనాథ్, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, నూరుల్లా, యూనియన్ సభ్యులు గోపాల్, శివకుమార్, రవి, నాయుడు, రాజు, నూర్‌మహమ్మద్, హనుమంతరాయప్ప, బాలకృష్ణ, గంగరాజు, మహేష్, హరి, రామ్మోహన్, అమర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాపురం ఉపాధ్యక్షుడిగా మారుతీ ప్రసాద్



నూతన ఉపాధ్యక్షుడిని అభినందిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట హోబళికి చెందిన సిద్ధాపురం గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడిగా మారుతీ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయం మీటింగ్ హాల్‌లో ఉపాధ్యక్ష స్థానానికి గురువారం జరిగిన ఎన్నికలో మారుతీ ప్రసాద్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆయన్ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజు తెలిపారు. కాగా ఈ ఎన్నిక రసవత్తరంగా జరిగింది. గ్రామ పంచాయతీలోని జేడీఎస్, కాంగ్రెస్ సభ్యులు, గ్రామ ప్రముఖులు ఒక్కటై ఎలాంటి పోటీ లేకుండా మారుతీ ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా నిర్ణయం తీసుకున్నారు. ఆయన ఎన్నిక పట్ల స్థానిక గ్రామ పంచాయతీ అధ్యక్షుడు, సభ్యులు, గ్రామస్తులులు హర్షం ప్రకటించారు. నూతన ఉపాధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు.

పులమతిలో విద్యా ప్రవేశం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యాప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పెద్దలు పనికి– పిల్లలు బడికి, అందరం చదువుదాం– అందరం ఎదుగుదాం, ఆడ మగ తేడా వద్దు అందరికి చదువే ముద్దు తదితర నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు మాట్లాడుతు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని, బడిబయట ఉన్న పిల్లలు పాఠశాలలో ఉండాలన్నారు. కార్యక్రమంలో పీడీ రామాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లికి వందనం..చదువుకు శఠగోపం

- చదివే పిల్లలు ఎందరున్నా పథకం ఒక్కరికేనా..
- సీఎంపై తల్లిదండ్రుల మండిపాటు

సాక్షి నెట్‌వర్క్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు తల్లికి వందనం పథకాన్ని ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంత మందికి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులందరికీ పథకం వర్తింపజేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న తల్లికి వందనం పథకంపై కొత్త మార్గదర్శకాలు విడుదల చేశారు. ఈ పథకం లబ్ధి పొందాలంటే ఆధార్ తప్పనిసరి ఉంటూ దారిద్ర్యరేఖకు దిగువ ఉండి 75 శాతం విద్యార్థి హాజరు శాతం ఉండాలని నిబంధనలు పెట్టారు. అలాగే తహసీల్దార్, సంబంధిత అధికారి ధ్రువీకరించిన సర్టిఫికెట్ జత చేయాల్సి ఉంటుందని ప్రకటించారు. అయితే ఇక్కడే సీఎం చంద్రబాబు మెలిక పెట్టారు. చదువుతున్న పిల్లలు ఎంతమంది అందరికీ ఇస్తామని ఇప్పుడు ఇంటికి ఒక్కరికి మాత్రమే పథకం వర్తింపజేసేలా నిబంధనలు పెట్టారు. దీంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల వివరాలు ఇలా..

నియోజకవర్గం	విద్యార్థుల సంఖ్య
హిందూపురం	46,722
మడకశిర	32,336

'తల్లికి వందనం' వర్తింపజేయాలి



కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఒకే ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతున్నా అందరికీ తల్లికి వందనం పథకం ద్వారా ఏటా రూ.15 వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటైంది. అధికారంలోకి వచ్చి నెల రోజులు కావస్తున్న ఈ పథకం కోసం ఎదురు చూస్తున్నాం. మా ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉండగా.. కుమార్తె ఒకటో తరగతి, కుమారుడు మూడో తరగతి చదువుతున్నారు. అయితే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నమ్మి రొళ్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించాం. దీంతో ఇద్దరు పిల్లలు రోజూ పాఠశాలకు వెళ్తున్నారు. ఫీజులు చెల్లించాలని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం డిమాండ్ చేస్తోంది. ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలి.

– తల్లి అరుణకుమారి, హునిసేకుంట గ్రామం, రొళ్ల మండలం

డబ్బు జమకాక ఇబ్బందులు



నా పేరు రూప. నాకు ఇద్దరు పిల్లలు. ప్రైవేటు పాఠశాల, కళాశాలలో ఇద్దరు పిల్లలను చదివిస్తున్నాం. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. దీంతో మా పిల్లలను ప్రైవేటు విద్యాలయాల్లో చదివిస్తున్నాం. అయితే ఇంత వరకూ తల్లికి వందనం డబ్బు ఖాతాలో పడలేదు. ప్రస్తుత అకడమిక్ సంవత్సరం ప్రారంభమైన వేస్తారనే నమ్మకం లేక పోయింది. ఇలా అయితే పేదల చదువులకు ఇబ్బందిగా ఉంటుంది.

– రూప గృహిణి, గొడనకుంట గ్రామం అమరాపురం మండలం.

మోసం చేశారు..



చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు విద్యను అభ్యసిస్తున్న పిల్లలందరికీ తల్లికి వందనం పథకం ద్వారా రూ.15 వేలు ఇస్తామన్నారు. ఇప్పుడేమో ఒకరికే అని చెబుతున్నారు. పిల్లల విషయంలోనూ సీఎం చంద్రబాబు మోసం చేయడం తగదు. ఎన్నికల్లో చెప్పిన విధంగా హామీ అమలు చేయాలి. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిని చదివించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే తల్లికి వందనం కింద మాకు రూ.30 వేలు ఇవ్వాలి.

– బోయ లక్ష్మి, పెద్దకోడిపల్లి రొద్దం మండలం

రూ.30 వేలు ఇవ్వాల్సిందే..



నాపేరు లక్ష్మీదేవి బాయి. వెంకటగిరి పాళ్యం పంచాయతీ మక్కాజిపల్లి తండా, పెనుకొండ మండలం. మేము వ్యవసాయం పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నాం. పుస్తకాలు, యూనిఫాం, పాఠశాల ఫీజులు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ప్రభుత్వం ఇద్దరి పిల్లలకు తల్లికి వందనం మంజూరు చేస్తే ప్రజలకు ఉపయోగకరం.

– లక్ష్మీదేవి బాయి మక్కాజిపల్లి తాండా, పెనకొండ

ఫీజులు కట్టేందుకు అవస్థలు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చెప్పిన సమయానికి పథకాలు అందాయి. అయితే ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పారు.. ఇప్పటికీ అందలేదు. నాకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. పిల్లల ఫీజులు కట్టాలి. డబ్బు కోసం వేరే వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– అనీత లక్ష్మీబాయి, ఎస్.ఎస్.సి తండా, సోమందేపల్లి

ఎదురుచూస్తున్నాం



నాకు ఇద్దరు పిల్లలు. ఒకరు 3వ తరగతి, మరొకరు 1వ తరగతి చదువున్నారు. తల్లికి వందనం కింద ప్రభుత్వం రూ.15 వేలు వంతున ఇంటిలో ఎంత మంది చదువుకునే విద్యార్థులు ఉంటే అందరికీ ప్రోత్సాహకం ఇస్తామన్నారు. పాఠశాలలు ప్రారంభమై నెల గడుస్తోంది. అయితే ఇంతవరకూ తల్లికి వందనం నగదు జమకాలేదు. ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా సీంఎ చంద్రబాబు ఇద్దరికీ కలసి రూ.30 వేలు జమ చేయాలి.

– పార్వతమ్మ, ఆదెపల్లి, చిలమత్తూరు మండలం

ఎందరున్నా పథకం వర్తింపజేయాలి



నాకు ముగ్గురు కుమార్తెలు. ప్రభుత్వ పాఠశాలలో 6, 9, 10వ తరగతి చదువుతున్నారు. నా భర్త కరోనా సమయంలో మృతి చెందాడు. అప్పటి నుంచి కూలి పనులకు పోయి పిల్లలను చదివిస్తున్నాను. ఇల్లు కూడా సరిగా లేదు. ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం పథకం వర్తింపచేస్తామని చంద్రబాబు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఒక్కరికే పథనం వర్తింపజేస్తారని తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ముగ్గురినీ చదివించాలా? వద్దా? అనే సందిగ్ధంలో ఉన్నాను. ఈ పథకం కోసం ఎదురు చూస్తున్నాను.

– లక్ష్మీనరసమ్మ, కుర్లపల్లి, లేపాక్షి మండలం

ముతుకూరులో వైద్య శిబిరం

గుడిబండ: మండలంలోని ముతుకూరు గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వెంగళరావు, భారతి తదితరులు అతిసారతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, చికిత్సలు చేశారు. వైద్యులు మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. వారానికోసారి డ్రైడే పాటించాలన్నారు. వ్యాధుల బారిన పడితే వెంటనే పరీక్షలు చేయించుకుని చికిత్సలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఆవరణంలో మొక్కల పెంపకం



ఆంజనేయస్వామి ఆలయ ఆవరణంలో మొక్క నాటుతున్న కమిటీసభ్యులు

హిందూపురం: హిందూపురంలోని మేళాపురం దండురోడ్డులో వెలసిన 27అడుగుల ఏకశిల ఆంజనేయ స్వామి మాన్యంలోఆలయకమిటీసభ్యులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ముద్దిరెడ్డిపల్లి చెందిన ఎం.రామకృష్ణ రూ.లక్ష, పురడి గోపాల్ రూ.15వేలు ఆర్థిక సహాయంతో మొక్కలు తెప్పించి నాటారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు డీసీ రఘు, వెంకటేష్ అశ్వత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్ కౌంటర్ ప్రారంభం

పెనుకొండ: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద రైతు బజార్ కౌంటర్‌ను మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు షాపుల్లో లభించే ధరల కంటే తక్కువ ధరకే రైతు బజార్‌లో సరుకులు లభిస్తాయని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంది బేడలు, బియ్యం, ఇతర సరుకులను విక్రయించడం జరుగుతుందన్నారు.

జూద కేంద్రంపై దాడి

మడకశిరరూరల్: మండలంలోని నల్లనాయనపల్లి చెరువు సమీపంలో జూద కేంద్రంపై దాడి చేసి, ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. వారి నుంచి రూ.8500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి

బత్తలపల్లి: ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని ఎరువుల దుకాణాలదారులను కదిరి ఏడీఏ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకుని వెళ్లాలని సూచించారు. బత్తలపల్లిలోని హనుమాన్ ట్రేడర్స్‌లో ఫిజికల్ స్టాక్, స్టాక్ రిజిస్టర్‌లో వ్యత్యాసం గల 27.935 మెట్రిక్ టన్నుల రూ.7,10,490లు విలువ గల ఎరువులకు స్టాఫ్ సేల్ నోటీస్ జారీ చేసినట్లు వివరించారు. ఏఓ ఓబిరెడ్డి, ఏఈఓ ఉపేంద్రరెడ్డి, వీపీఓ నాగార్జున ఉన్నారు.

తాడిమర్రి: ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కదిరి ఏడీఏ ఎస్.సత్యనారాయణ దుకాణదారులను హెచ్చరించారు. స్థానిక శ్రీనివాస ఫర్టిలైజర్, ఎస్వీ ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, బిల్లుల పుస్తకాలను పరిశీలించారు.

ప్రపంచ జనాభా దినోత్సవంపై ర్యాలీ



చిలమత్తూరులో పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహిస్తోన్న వైద్య సిబ్బంది



లేపాక్షిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



సోమందేపల్లిలో ర్యాలీలో చేస్తున్న వైద్య సిబ్బంది

లేపాక్షి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకట చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం ఉదయం ప్రపంచ జనాభా దినోత్సవంపై వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ రమాదేవి, హెల్త్ అసిస్టెంట్లు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిలమత్తూరు: చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం అని వైద్యాధికారి డా. రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో కలసి ర్యాలీ నిర్వహించారు.

పరిగి: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తొలుత జనాభా పెరుగుదల, ఫలితంగా కలిగే నష్టాలు తదితర అంశాలను తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిన్న కుటుంబం వల్ల కలిగే లాభాలతో పాటూ పెద్ద కుటుంబాలతో కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన, స్వరూపరెడ్డి, సీహెచ్‌ఓ వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

జనాభాను నియంత్రించుకోవాలి

సోమందేపల్లి: పెరుగుతున్న జనాభాను నియంత్రించుకోలేక పోతే అనేక నష్టాలను చూడాల్సి వస్తుందని వైద్యాధికారి హరికుమార్ తెలిపారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. జనాభా నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మనోహర్ రెడ్డి, సూపర్ వైజర్‌లు రవీంద్ర, సీనియర్ అసిస్టెంట్ మధు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఔట్ల తొలగింపు

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ,అనధికార లేఔట్లలో ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వబోమని మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఆర్ఎస్‌కు అర్హత కలిగిన లేఔట్లలో మాత్రమే ఇళ్ల నిర్మాణానికి అనుమతి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. 2019 ఆగస్టు 31 లోపు వేసిన లేఔట్లు మాత్రమే ఎల్‌ఆర్ఎస్ అర్హత కలిగి ఉంటాయని తెలిపారు. ఆ తర్వాత వేసిన లేఔట్లకి ఎల్‌ఆర్ఎస్ అర్హత ఉండదని తెలిపారు. 2019 ఆగస్టు 31 తర్వాత వేసిన లేఔట్లలో ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసి, ఇబ్బందులు పడొద్దని కోరారు. మారుతీనగర్, మధుగిరి రోడ్డు, వైబీహళ్లి రోడ్డులోని లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేయొద్దని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో 8 అక్రమ లేఔట్లను గుర్తించి తొలగించామని తెలిపారు.

ర్యాపిట పంచాయతీకి అరుదైన ప్రశస్తి



ప్రశస్తి అందజేస్తున్న మంత్రి డాక్టర్ పరమేశ్వర్

పావగడ: తాలూకాలోని ర్యాపిట గ్రామ పంచాయతీకి అరుదైన ప్రశస్తి లభించింది. ఈ సందర్భంగా తుమకూరులో గురువారం జరిగిన జిల్లా స్థాయి గ్రామ పంచాయతీ పీడీఓ (పంచాయతీ అభివృద్ధి అధికారి)ల శిక్షణ శిబిరంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్, శిర ఎమ్మెల్యే, ఢిల్లీ విశేష ప్రతినిధి టీబీ జయచంద్ర, పావగడ ఎమ్మెల్యే హెచ్ వి. వెంకటేశ్ లు ర్యాపిట పీడీఓ సుదర్శన్‌కు ప్రశస్తి అందజేశారు.

రేపు కేంద్ర మంత్రి సోమన్న రాక

మడకశిర: కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న శనివారం మడకశిరకు వస్తున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఆయన శనివారం ఉదయం 10: 30 గంటలకు పట్టణంలోని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఇంటికి చేరుకొని మడకశిర మీదుగా వెళ్తున్న రాయదుర్గం – తుమకూరు రైల్వేలైన్ నిర్మాణంపై చర్చిస్తారని తెలిపారు. కుంచిటి వక్కలిగ, సాదర, లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చే అంశంపై కూడా చర్చిస్తారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, హిందూపురం ఎంపీ పార్థసారథి తదితరులు కూడా ఈ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

బాల్య వివాహాలను అరికడదాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుడిబండ: మండలంలోని మందలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్‌డీటీ మహిళా శిశు సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాలను అరికడదాం –ఆడబిడ్డలను కాపాడుదాం అనే కార్యక్రమాన్ని ఆర్‌డీటీ టీమ్ లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముందుగా 8వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న అమ్మాయిలకు లఘు చిత్రాల ద్వారా ప్రస్తుత సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలి (బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు) అనే అంశంపై అవగాహన కల్పించారు. సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల అమ్మాయిలు మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతారని తెలిపారు. ఆడ పిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఓ ప్రతాప్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాండు రంగప్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి సద్వినియోగం చేసుకోవాలి

పావగడ: విద్యాసామగ్రి సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ సేవాశ్రమాధిపతి స్వామీ జపానంద తెలిపారు. గురువారం తాలూకాలోని కే రాంపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను దత్తత తీసుకున్న రామకృష్ణ సేవాశ్రమాధిపతి స్వామి జపానంద 53 మంది విద్యార్థులకు స్కూలు బ్యాగులు, నోటు పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా జపానంద మాట్లాడుతూ దత్తత తీసుకున్న గ్రామీణ ప్రాంత కే రాంపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం చంద్రశేఖరరెడ్డికి ట్యాబ్ అందించారు. ఆశ్రమ భక్తుడు దేవరాజ్ అంగనవాడీ కేంద్రానికి కుక్కర్, మిక్సీ అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు రాంపురం నాగేశ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల తనిఖీ

రొళ్ల: మండలంలోని గుడ్డగుర్కి, జీఎస్ పాళ్యం, వన్నప్పపాళ్యం, దాసప్పపాళ్యం తదితర గ్రామాల ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ శ్రీధర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. మెనూ ప్రకారం రుచికరంగా భోజనాన్ని వడ్డించాలని ఎండీఎం నిర్వాహకులకు సూచించారు. పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై విద్యను అభ్యసించే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు, ఎండీఎం నిర్వాహకులు పాల్గొన్నారు.

డ్రమ్ములు, టార్పాలిన్లు పంపిణీ

అమరాపురం: మండలంలోని దేవగానపల్లి గ్రామ ఎస్సీ రైతులకు డ్రమ్ములు, టార్పాలిన్లు వ్యవసాయాధికారి మంజునాథ గురువారం పంపిణీ చేశారు. గ్రామంలోని ఎంపికైన ఎస్సీ రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేస్తున్నారు. వీరికి అవసరమైన వస్తువులను ఏపీసీఎన్ఎఫ్ సంస్థ ద్వారా మడకశిర సబ్ డివిజన్ డీపీఎం లక్ష్మానాయక్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ రంగనాథ్, ఐసీఆర్పీలు గీత, లక్ష్మీనరసమ్మ, మీనాక్షి, మేఘశ్రీ, చైత్ర రైతులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపుల్లోనూ రాజకీయం

హిందూపురం: మండలంలో కక్షసాధింపు రాజకీయాలు సాగుతున్నాయి. చౌళూరు గ్రామంలో గత ఎన్నికల సమయంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు రహదారుల పక్కన ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీ బోర్డులు తీసివేయాలని టీడీపీ నాయకులు ఒత్తిడి చేయడంతో పంచాయతీ అధికారులు రోడ్డుపక్కన ఉన్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు చౌళూరు మధుమతిరెడ్డికి సంబంధించిన ఫ్లెక్సీలను తొలగించారు. టీడీపీ నాయకుల ఫ్లెక్సీలను తీసివేయలేదు. కేవలం వైఎస్సార్‌సీపీకి సంబంధించిన ఫ్లెక్సీలు మాత్రమే తీసివేయడం సరికాదని ప్రజలు విమర్శిస్తున్నారు.

జూదరుల అరెస్ట్

పావగడ: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరమ్మనహల్లి గేట్ వద్ద ఉన్న పశవల్లి క్లబ్‌లో పేకాట ఆడుతున్న 23 మంది జూదరులను స్థానిక పోలీసులు గురువారం సాయంత్రం అరెస్ట్ చేశారు. జూదరుల నుంచి రూ. 54 వేలు నగదు, ఏడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ సురేశ్ నేతృత్వంలో జరిగిన దాడుల్లో ఎస్ఐ గురునాథ్, పీసీలు శ్రీకాంతనాయక్, తల్వార్ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

అగళిలో 11 మంది..

అగళి : మండల పరిధిలోని ముత్తేపల్లి గ్రామం వద్ద 11 మంది పేకాట రాయుళ్లను ఎస్ఐ వీరేష్ సిబ్బందితో వెళ్లి గురువారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6,270 నగదు స్వాధీనం చేసుకున్నారు. కదిరేపల్లి గ్రామం శేఖర్ అనే వ్యక్తి నుంచి 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు.

నేడు నిత్యావసరాల పంపిణీ ప్రత్యేక కౌంటర్ ప్రారంభం

హిందూపురం టౌన్: పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ రూమ్ 14లో నిత్యావసర సరుకుల పంపిణీ ప్రత్యేక కౌంటర్‌ను శుక్రవారం ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి గురువారం తెలిపారు. బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు అందజేస్తామన్నారు. ఒకరికి 4 కిలోల కందిపప్పు, 5 కిలోల రా రైట్, స్టీమ్ రైస్ పంపిణీ చేస్తామన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



షాజియా

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో 583 మార్కులు సాధించిన షాజియా అనే విద్యార్థిని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం శోభారాణి గరువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని షాజియాను ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందిచారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని హెచ్ఎం సూచించారు. తమ కుమార్తెకు ట్రిపుల్ ఐటీలో సీటు రావడంపై తల్లిదండ్రులు ఇమామ్, ఇమామ్ బీ హర్షం వ్యక్తం చేశారు.

ఖాళీ స్థలాల లీజుపై అవగాహన

హిందూపురం: ఆర్టీసీకి సంబంధించి ఖాళీ స్థలాలు 15 సంవత్సరాలు కాలపరిమితితో లీజులు ఇవ్వడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు హిందూపురం డీఎం ప్రకటనలో తెలిపారు.13వ తేది శనివారం 11గంటలకు హిందూపురం డిపోలో పుట్టపర్తి జిల్లా అధికారి అవగాహన సదస్సు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కల్గిన వ్యాపారులు అవగాహన సదస్సులో పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు.